క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావుకు అభినందనలు



దూలం నాగేశ్వరరావును అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావును ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అభినందించారు. జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు నాయకత్వంలో ఏలూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం కావాలని అబ్బయ్యచౌదరి ఆకాంక్షించారు.

పాఠశాలలకు మైక్ సెట్ బహూకరణ



పూళ్ల ఉన్నత పాఠశాలకు మైక్ సెట్‌ను బహూకరించిన దృశ్యం

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ శుక్రవారం రూ.15వేలు విలువ గల మైక్ సెట్‌ను బహూకరించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కాసాని రామలక్ష్మీ, వైస్ చైర్మన్ కూటికుప్పల నాగసావిత్రి రూ.15వేలతో మైక్ సెట్‌ను దివంగత సర్పంచ్ పుప్పాల మోహనసీతారామయ్య జ్ఞాపకార్థం వారు బహూకరించారు. హెచ్‌ఎం పి.భువనేశ్వరరావుకు వారు మైక్‌సెట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు గంధం లక్ష్మణ్, కె.వెంకట సుబ్బయ్య, మరడాని దుర్గా ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంపై పసుపు ముద్ర



చల్లచింతలపూడి గ్రామ సచివాలయంపై వేసిన పసుపు రంగు

దెందులూరు: ప్రభుత్వ కార్యాలయంపై గ్రామ సచివాలయాలపై పసుపు రంగు వేస్తున్నారు. మండలంలోని చల్లచింతలపూడి గ్రామ సచివాలయానికి పసుపు ముద్ర వేశారు. విద్యుత్ స్తంభాలు, రోడ్డుకిరువైపులా చెట్లు, వంతెనలకు వేసిన పసుపు రంగును పూసిన టీడీపీ శ్రేణులు ఇప్పుడు సచివాలయాలవైపు దృష్టి సారించి వాటికి పసుపు రంగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో చల్లచింతలపూడి గ్రామ సచివాలయంపై పసుపు ముద్ర వేశారు.

పరిశ్రమ యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): అనకాపల్లి ప్రాంతంలో అచ్యుతాపురం సెజ్ పరిధిలో 2019లో స్థాపించిన ఎస్సెన్షియ అడ్వాన్స్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఫార్మా కంపెనీలో ఈ నెల 21 సంభవించిన పేలుడులో 18 మంది మరణించారని ఈ దారుణానికి బాధ్యులైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కే భాషా శుక్రవారం కోరారు. ఈ ఘటనకు బాధ్యులైన పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టాయిలెట్ల భారం ఇప్పుడే అధికం : ఏపీటీఎఫ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాలలో టాయిలెట్ ఫొటోలు తీసే పనిలో గతంలో కంటే ఇప్పుడే భారం అధికంగా ఉంటోందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ. రత్నం బాబు, జి. మోహన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల నుంచి 3.30 గంటల మధ్యలో ప్రధానోపాధ్యాయులు టాయిలెట్లను పరిశీలించి రిపోర్ట్ సబ్మిట్ చేయాలని ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రధానోపాధ్యాయులు పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ లేదా ఎస్‌ఎంసీ కమిటీ టాయిలెట్ల ఫొటోలు తీయకపోయినా ఆ ఒత్తిడి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై పడుతోందన్నారు. టాయిలెట్‌కు సంబంధించి పూర్తి బాధ్యత నుంచి ప్రధానోపాధ్యాయులను మినహాయించి వారిని విద్యా బోధనకే పరిమితం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



విద్యావిధానంలో మార్పు అవసరం



ఉంగుటూరు: ఆడపిల్లల్ని కనాలంటేనే భయమేస్తోంది. విద్యావిధానంలో మార్పు తీసుకురావాలి. సెకండరీ విద్య స్థాయి నుంచి పిల్లలకు మంచి చెడులు తెలిసేలా బోధన సాగాలి. ఆడపిల్లలు విషయంలో ఎలా నడుచుకోవాలో మగ పిల్లలకు చిన్నప్పటి నుంచి వివరించాలి. డ్యూటీలో ఉన్న డాక్టరు లేదా నర్సింగు స్టాఫ్‌మీద ఎవరు అఘాయిత్యానికి పాల్పడినా ఎటువంటి దౌర్జన్యాలకు పాల్పడినా కఠినంగా శిక్షించే చట్టాలు ప్రభుత్వం తీసుకురావాలి. ప్రతి హాస్టల్ వద్ద సెక్యూరిటీ పెంచాలి. కోల్‌కతా జూనియర్ డాక్టరుపై జరిగిన ఘటన చాలా బాధాకరం. ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ మానస, కాగుపాడు, పీహెచ్‌సీ

సుప్రీంకోర్టు స్పందించిన తీరు హర్షణీయం



భీమడోలు: కోల్‌కత్తాలోని మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి అతికిరాతంగా హత్య చేసిన దుర్మార్గమైన ఘటనపై సుప్రీంకోర్టు స్పందించిన తీరు హర్షణీయం. వైద్య సేవలందించే ప్రాంతాల్లో మహిళా సిబ్బందికి రక్షణ, భద్రత చర్యలు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలో పని చేసే మహిళా వైద్యురాలు, స్టాఫ్ నర్సులు రాత్రి వేళల్లో తమ విధులు నిర్వర్తించే తరుణంలో రోగుల వెంట వచ్చే వ్యక్తులు మద్యం సేవించి సిబ్బందిపై దురుసుగా మాట్లాడడం వంటి సందర్భాలు అనేకం. ఒంటరిగా ఉండే స్టాఫ్ నర్సులు భయపడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆసుపత్రుల్లో పని చేసే మహిళా వైద్య సిబ్బందికి రక్షణ, భద్రతలకు ప్రత్యేక చట్టం తీసుకోవాలి.

– డాక్టర్ కె.శ్రీలక్ష్మి, వైద్యాధికారిణి, భీమడోలు

గ్రామ సభల్లోనూ 'పచ్చ'పాతం

- టీడీపీ నేతల ఆధ్వర్యంలో గ్రామసభలు
- వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లకు, ప్రజాప్రతినిధులకు అందని ఆహ్వానం
- అధికారులు, కార్యదర్శులు సైతం వత్తాసు
- తూతూ మంత్రంగా సభలు



కోమటిలంకలో పచ్చనేత అధ్యక్షతన జరిగిన గ్రామసభ, హాజరైన కార్యదర్శి, పోలీసులు



కోమటిలంకలో గ్రామ సభకు వచ్చి నిలబడిన ప్రజలు



కోమటిలంక పంచాయతీ కార్యాలయంలో ఒక్కడే కూర్చున్న సర్పంచ్ యోహాన్

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గం, ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో శుక్రవారం అధికారులు నిర్వహించిన గ్రామసభలు పంచాయతీ వ్యవస్థను అపహాస్యం చేశాయి. వైఎస్సార్‌సీపీ బలపరచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు లేకుండా పచ్చనేతలు ఇష్టారాజ్యంగా తమకు నచ్చిన ప్రదేశాల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామ కార్యదర్శులతో పాటు పోలీసులు సైతం పచ్చనేతలకు వత్తాసు పలికారు. ఆఖరికి మండల అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి సైతం గ్రామ సభలో పాల్గొనలేని పరిస్థితులను పచ్చనేతలు సృష్టించారు. సభకు వచ్చిన ప్రజలకు కనీసం కుర్చీలు, టెంట్లు, తాగునీరు సైతం ఏర్పాటు చేయలేదు. అంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లో తూతూ మంత్రంగా సభలు నిర్వహించి మమ అనిపించారు.

- కోమటిలంకలో నిర్వహించిన సభకు టీడీపీ నాయకుడు ముంగర నాగరాజు అధ్యక్షత వహించడం అందరినీ నిర్ఘాంతపోయేలా చేసింది. సర్పంచ్ తెనాలి యోహాన్ పంచాయతీ కార్యాలయంలో సభ ఏర్పాటు చేయగా, పచ్చనేతలు బీసీ కాలనీలో గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌తో పాటు సచివాలయ ఉద్యోగులు, రూరల్ పోలీసులు సైతం టీడీపీ నాయకుడు నిర్వహించిన సభలోనే పాల్గొన్నారు. ఆఖరికి అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలు, పనులు గుర్తించకుండానే సభలో పాల్గొన్న వారితో కార్యదర్శి ప్రసాద్ సంతకాలు సేకరించి వెళ్లిపోయాడు. దీనిపై సర్పంచ్ యోహాన్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ గ్రామాభివృద్ధి కుంటుపడేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సైతం దీనికి వత్తాసు పలకడం బాధ కలిగించిందన్నారు.
- చాటపర్రులో ఎంపీడీఓ బి.ప్రణవి అధ్యక్షతన సభ జరిగింది. సర్పంచ్ గుడిపూడి రఘు సభకు వచ్చిన వేదికపై కూర్చోకుండా వెళ్లిపోయారు. సుమారు 30 నిమిషాల పాటు జరిగిన సభలో టీడీపీ నాయకులు ముంగర నాగరాజు, త్రినాథ్ చౌదరి, రంగారావు పాల్గొని పచ్చనేతలు సూచించిన పలు పనులతో పాటు సుమారు 125 పనులు అధికారులు ఆమోద ముద్ర వేశారు.
- పెదయాగనమిల్లిలో నిర్వహించిన గ్రామ సభకు సర్పంచ్ బలే నాగసులోచనను ఆహ్వానించలేదు. టీడీపీ నాయకులు సభ నిర్వహించారు.
- కోటేశ్వరదుర్గాపురంలో సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. గ్రామస్తులు, పెద్దలు, ఉపాధి కూలీల సూచనలు మేరకు మినీగోకులం, రోడ్లు, డ్రెయిన్లు తదితర 47 పనులకు సభ ఆమోదం తెలిపింది.
- ఇదే కోవలో గుడివాకలంక, మొండికోడు, మాదేపల్లి, జాలిపూడి, శ్రీపర్రు తదితర గ్రామాల్లో సభలు తూతూ మంత్రంగా జరిగాయి

ఉపాధి హామీ సిబ్బందిపై ఫిర్యాదు

భీమడోలు: గుండుగొలనులో శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగిందని, అందులకు బాధ్యులైన క్షేత్ర సహాయకులపై తగు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీకి ఏఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్ ఫిర్యాదు చేశారు. 2024 వేసవిలో ఉపాధి పనులకు వెళ్లని వారికి, ఇంటి నుంచి బయటకు రాలేనివారికి, సహకార సంఘంలోని సిబ్బంది, ప్రైవేటు సంస్థల్లో పని చేసే వారికి, రాజకీయ నాయకులకు దొంగ మస్తర్లు వేసి డబ్బులను జమ చేశారన్నారు. బాధ్యులైన క్షేత్ర సహాయకుడు, అతనికి సహకరించిన మండల స్థాయి అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదు చేశారు.

రెండు వాహనాల సీజ్

దెందులూరు: దెందులూరు మండలం వేగవరం వద్ద ఎస్సై స్వామి పర్యవేక్షణలో పట్టుకున్న 3,500 కేజీల బియ్యాన్ని శుక్రవారం ఏలూరు స్టాక్ పాయింట్‌కు తరలించారు. రెండు వాహనాలను సీజ్ చేశారు. నలుగురిపై పోలీస్, సివిల్ సప్లయ్ విభాగాల్లో నాలుగు సెక్షన్లు పెట్టి కేసు నమోదు చేశామని ఎస్సై కె.స్వామి, తహసీల్దార్ సుమతి తెలిపారు.

నేడు వ్యాయామ కళాశాలలో ప్రాజెక్టు మీటింగ్

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో శనివారం ప్రాజెక్టు మీటింగ్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నత్తానియేలు తెలిపారు. ముఖ్య అతిథిగా మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) విచ్చేస్తారని తెలిపారు. ప్రాజెక్టు మీట్‌లో అన్ని రకాల స్పోర్ట్స్ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు.

టంగుటూరి జీవితం నేటి తరానికి ఆదర్శనీయం



దెందులూరు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ వి.శ్రీలత, ఏఓ భీమరాజు

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు రాష్ట్రానికి చేసిన సేవలు ఆంధ్రకేసరిగా గుర్తింపును తెచ్చాయని దెందులూరు ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ వి.శ్రీలత, ఏఓ భీమరాజు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

టంగుటూరి ప్రకాశంపంతులు సేవలు స్ఫూర్తిదాయకం

భీమడోలు: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు జాతి ముద్దు బిడ్డ, ఆంధ్ర కేసరి, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి కార్యక్రమాలు శుక్రవారం విద్యాసంస్థలు, శాఖా గ్రంథాలయాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాల, పాతూరు ప్రాథమిక పాఠశాలల్లోను, భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో జయంతిని నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నేవారిగూడెం హెచ్‌ఎం షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి, జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. పాతూరులో హెచ్‌ఎం పి.నిర్మలకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శనలో ఉంచి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు మండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరు జయంత్యుత్సవం

గణపవరం: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 150 జయంతి సందర్భంగా శుక్రవారం జల్లికొమ్మర యూపీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలతో ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌజన్య, ప్రసాదరావు, శ్రీదేవి, పార్వతి, సరస్వతి, రమేష్ తదితరులున్నారు.

నవజీవన ప్రార్థనా మందిరం ప్రారంభం

నిడమర్రు: పత్తేపురంలో నూతనంగా నిర్మించిన నవజీవన ప్రార్థనా మందిరం (చర్చి) భవనాన్ని శుక్రవారం ప్రారంభం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని మాట్లాడారు. ప్రార్థనా మందిరం అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు స్పీకర్ బహూకరణ

ఏలూరు రూరల్ : కస్తూర్బా బాలికల పాఠశాలకు రిటైర్డ్ హెచ్‌ఎం జల్లా వీరభద్రరావు అవుజా కంపెనీ సౌండ్ స్పీకర్, మైక్‌లను శుక్రవారం బహూకరించారని ప్రధానోపాధ్యాయురాలు జి సునీత చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నందున విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తున్నానని వీరభద్రరావు అన్నారు. సుమారు రూ. 20 వేలు విలువ కల్గిన పరికరాలు అందజేతపై పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.మురళీకృష్ణతో పాటు పలువురు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలోనూ క్రీడాకారిణులకు బూట్లు, దుస్తులు, నగదు బహుమతి అందజేసారని గుర్తు చేశారు.

వైభవంగా పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. స్థానిక సత్రంపాడులోని స్వయంభూ సౌభాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విజయ లక్ష్మిగా అలంకరించారు. స్థానిక 12 పంపుల సెంటర్‌లోని దుర్గమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గాజులతో ప్రత్యేకంగా అలంకరించి, ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

పంచాయతీల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా కృషి



భీమడోలులో సభలో మాట్లాడుతున్న ఏలూరు ఆర్డీవో ఎన్‌ఎస్‌కే ఖాజావలి

భీమడోలు: గ్రామ పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 24–25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పనులు గుర్తింపు, ప్రణాళిక తదితర అంశాలపై గ్రామ సభలు నిర్వహించారు. పోలసానిపల్లి గ్రామ పంచాయతీ వద్ద సాయంత్రం నిర్వహించిన గ్రామ సభకు సర్పంచ్ షేక్ రహీమా బేగం అధ్యక్షత వహించారు. గ్రామస్థాయిలో గుర్తించిన ముఖ్యమైన పనులు, వాటికి ఇవ్వాల్సిన తొలి ప్రాధాన్యత తదితర అంశాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పంచాయతీ స్వయంశక్తి పంచాయతీలు సాకారం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఉదయం భీమడోలు గ్రామ పంచాయతీ వద్ద జరిగిన సభకు సర్పంచ్ పాము సునీత అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు ఆర్డీవో ఎన్‌ఎస్‌కే ఖాజావలి, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పాల్గొని ప్రసంగించారు. ఉపాధి హామీ పథకపు పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగిందని గ్రామస్తులు సభ లో ఫిర్యాదులు చేశారు. వాటిపై విచారణ చేయిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకోవాలన్నారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగంలో దూసుకుపోతున్న భారత్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : అంతరిక్ష రంగంలో భారతదేశం దూసుకుపోతోందని జిల్లా సైన్స్ అధికారి ఎస్‌వీఎస్ సోమయాజులు అన్నారు. శుక్రవారం స్థానిక 12 పంపుల సెంటర్ గాంధీనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నేషనల్ స్పేస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో ఇటీవలి కాలంలో భారతదేశం ఎన్నో విజయాలు సాధించిందని అన్నారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించి దేశం గర్వించే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అంతరిక్ష నమూనా తయారీపై నిర్వహించిన పోటీలో మూహెచ్ దుర్గా ప్రసాద్, క్విజ్ పోటీలో పీ. తేజేశ్వరి, పెయింటింగ్ పోటీల్లో ఐ. దుర్గా సాహిత్ విజేతలుగా నిలిచారు. విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించాం

చంద్రయాన్–3 విజయంతో భారత్ అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఏ. నిర్మల జ్యోత్స్న అన్నారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇస్రో అద్భుతమైన పనితీరును, పరిశోధనలో భారతదేశ మార్గదర్శక పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ పీఎం సెలీన్ రోస్ మాట్లాడుతూ జాతీయ అంతరిక్ష దినోత్సవం అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి, అంతరిక్ష విద్యను ప్రోత్సహించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై, చంద్రయాన్ ప్రయోగంపై క్విజ్, పోస్టర్ పెయింటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమ నిర్వాహకులను కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మరియా క్రిస్టియ, సిస్టర్ సుశీల, అధ్యాపకులు అభినందించారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దుతాం



భీమడోలులో బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య ప్రతినిధి రామకృష్ణ

భీమడోలు: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీ ఎయిడ్స్ నియంత్రణ విభాగం జిల్లా ప్రతినిధి రామకృష్ణ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినీ విద్యార్థులకు మీకు తెలుసా అనే పేరుతో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి హెచ్‌ఎం అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రతినిధి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులను చైతన్యపర్చాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం మురళీ, చంద్రకళ, ఆశావర్కర్లు, టీచర్లు, పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకంతో గ్రామాల అభివృద్ధి



పెదపాడు మండలంలోని అప్పనవీడులో మాట్లాడుతున్న డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్

ఉంగుటూరు: గ్రామాలు స్వయం ప్రతిపత్తితో పాలించుకునే విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్టు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం నాచుగుంట పంచాయతీ ఆఫీసు వద్ద గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఉపాధి పథకంతో గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని ఆయన అన్నారు. సర్పంచి ఏలేటి లక్ష్మీసునీత అధ్యక్షత వహించారు. డీఎల్‌డీవో ఏబీవీ లక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీడీవో శర్మ, తహసీల్దారు శేఖర్, ఎంపీటీసీ గంటా ఉషారాణి, నాయకులు పాల్గొన్నారు.

పనులు పూర్తిస్థాయిలో గుర్తించాలి

పెదపాడు: ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు వివరించాల్సిన అవసరముందని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు, వట్లూరు, కొక్కిరపాడులో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. అప్పనవీడులో పెదపాడు ఎంపీడీవో జే తేజరతన్, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఉపసర్పంచ్ అప్పన ప్రసాద్, ఏఓ వానపల్లి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు. వట్లూరులోని గ్రామ సభలో పంచాయతీ ఈఓ మేకా శ్రీనివాస్, సర్పంచ్ గుజ్జుల ఝాన్సీ, కొమ్మన బుడ్డియ్య, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. పెదపాడులో నిర్వహించిన కార్యక్రమంలో పెదపాడు సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి, ఈఓ డీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు వినియోగించుకోవాలి

నిడమర్రు: గ్రామాల్లో చేపట్టే మహాత్మా గాంధీ ఉపాధి పథకం పనులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలో 16 గ్రామాల్లో శుక్రవారం ఆయా గ్రామ పంచాయితీల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. పత్తేపురంలో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రజల వద్దనుంచి సమస్యల అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండయ్య తదితరులున్నారు.

గ్రామీణ ఉపాధి హామీతో అభివృద్ధి

దెందులూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పటిష్టంగా అమలు జరిగితేనే క్షేత్రస్థాయిలో కూలీలకు ఉపాధి, అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం కొప్పాక, నడిపల్లి, విజయరాయి గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. పెదవేగి మండల టీడీపీ అధ్యక్షుడు బొప్పన సుధ, అధికారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కేంద్రం ఉపాధి హామీ నిధులు పెంచాలి

భీమడోలు: ఉపాధి హామీ నిధులు కేంద్ర ప్రభుత్వం పెంచడం ద్వారానే గ్రామాల్లో వలసలు తగ్గుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలులో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని మంచినీటి చెరువుల పూడికతీతను ఉపాధి హామీ పథకం నుంచి తొలగిస్తున్నట్లు తాజా నివేదికలు తెలుపుతున్నాయన్నారు. గ్రామ పంచాయతీల్లో చెరువుల పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఉపాధి పనులు 100 రోజుల నుంచి 200కు పెంచాలని, వేతనాన్ని రూ.300 నుంచి రూ.600 పెంచాలన్నారు.

గ్రామగ్రామానా ఉపాధి సభలు

దెందులూరు: గ్రామగ్రామాన నిర్వహించనున్న ఉపాధి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఉపాధి ఏపీఓ దశరధ రామ్‌జీ అన్నారు. దెందులూరులో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఏపీఓతో పాటు తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ వి.శ్రీలత, క్లస్టర్ ఇన్‌ఛార్జి గారపాటి కొండయ్యచౌదరి, మాజీ ఎంపీటీసీ ఇప్పిలి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తోట ఏసమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.